# కర్ణాటకకు బై బై.. తెలంగాణకు హాయ్!

## 35 ఏండ్ల కిందటి ముచ్చట ఇది..

రమేశ్ కన్నన్ అనే యువకుడికి ఎలక్ట్రానిక్స్ సబ్జెక్ట్ అంటే చాలా ఇష్టం. తన ఇష్టానికి అనుగుణంగా మైసూరు ఇంజినీరింగ్ కాలేజీలో 1988లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాడు. అదే ఏడాది మైసూరులో ఓ చిన్న గదిని అద్దెకు తీసుకొని కేన్స్ టెక్నాలజీస్ పేరిట ఓ ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ కంపెనీని స్థాపించాడు. తాను పెరిగిన ప్రాంతంలోని యువతకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతోనే కర్ణాటకలోనే దీన్ని స్థాపించినట్టు చెప్పాడు.

## మూడున్నర దశాబ్దాలు గడిచాయి..

అద్దె గదిలో మొదలైన కేన్స్ టెక్నాలజీస్ ఇప్పుడు 1,500కు పైగా ఉద్యోగులతో, రూ.676 కోట్లు ఆదాయంతో మూడు ఖండాల్లోని 250 మంది క్లయింట్లకు సేవలందించే స్థాయికి చేరింది. సుఖోయ్ జెట్స్, మెట్రో ట్రైన్స్ కీలక విడిభాగాలను కూడా తయారుచేస్తున్నది. తాను పెరిగిన గడ్డ మీద మమకారంతో 35 ఏండ్ల కిందట కర్ణాటకలో కంపెనీని స్థాపించిన కన్నన్.. ఇప్పుడు అదే కర్ణాటకను వద్దనుకొని తెలంగాణలో 2,800 కోట్లతో కేన్స్ సెమీకండక్టర్ ప్లాంట్‌కు ఇటీవల భూమి పూజ చేశారు. ఎందుకు?? కారణాలు రెండు. ఒకటి.. కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారు అసమర్థ పాలన. రెండు.. తెలంగాణలో బీఆర్ఎస్ సర్కారు స్నేహపూర్వక పారిశ్రామిక విధానం.

**కాంగ్రెస్‌కు ఓటేస్తే.. కరెంటు పోతది, నీళ్లు పోతయ్, పింఛన్లు పోతయ్, వచ్చే కంపెనీలు కూడా పోతయ్. అందుకు ఇదే తాజా ఉదాహరణ.**

## కన్నడనాట పుట్టిన కంపెనీ తెలంగాణకు తరలింపు

- కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ విధానాలే కారణం!
- కేన్స్ సెమీకండక్టర్ ప్లాంట్ వెనుక అసలు కథ ఇదే
- ఆ రాష్ట్ర సర్కారుపై ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో ఫైర్
- ఇలాగైతే యువతకు ఉద్యోగాలెలా అని మండిపాటు
- తెలంగాణ టీఎస్ఐపాస్ విధానంపై సర్వత్రా ప్రశంసలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): కర్ణాటక కంపెనీ.. కేన్స్ టెక్నాలజీస్ రూ.2,800 కోట్లతో ఓఎస్ఏటీ, కాంపౌండ్ సెమీకండక్టర్ ఉత్పాదక కేంద్రాన్ని తెలంగాణకు తీసుకువస్తున్నది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కొంగరకలాన్ గ్రామంలో ఈ ప్లాంట్ కోసం గత మంగళవారం భూమిపూజ జరిగింది. దీంతో కొత్తగా 2,000 మందికిపైగా ఉద్యోగావకాశాలు రానున్నాయి. అయితే, కర్ణాటకలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు అసమర్థ విధానాల కారణంగానే అక్కడ నెలకొల్పవలసిన సెమీకండక్టర్ ఉత్పాదక కేంద్రాన్ని కేన్స్ టెక్నాలజీస్ సంస్థ తెలంగాణకు తరలించిందన్న విషయం తాజాగా వెల్లడైంది.

### సంప్రదించాలనుకొన్నప్పటికీ..

ఎలక్ట్రానిక్స్ రంగంలో కొనసాగుతూనే, సెమీకండక్టర్ సెక్టార్‌లో విస్తరించాలన్న ఉద్దేశంతో కేన్స్ టెక్నాలజీస్ తొలుత మైసూరులో రూ. 2,800 కోట్లతో ప్లాంట్‌ను ప్రారంభించాలనుకొన్నది. ఈ మేరకు అనుమతులనివ్వాలంటూ కర్ణాటక కాంగ్రెస్ సర్కారుకు మూడు నెలల కిందట ప్రతిపాదనలు పంపింది. అయితే, ఎన్నిరోజులు గడిచినప్పటికీ, సర్కారు నుంచి సమాధానం రాలేదు. పరిశ్రమల శాఖకు చెందిన ప్రభుత్వాధికారులను కేన్స్ ప్రతినిధులు సంప్రదించాలని చూశారు కూడా. అయినప్పటికీ, ఫలితం లేకుండా పోయింది. మరోవైపు ప్లాంట్‌లో పెట్టుబడులు పెట్టిన ఇతర భాగస్వాముల నుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి. అనుమతుల్లో జాప్యంతో కంపెనీ దీర్ఘకాలిక ప్రణాళికలు మారే ప్రమాదం ఏర్పడింది. దీంతో చేసేదేమీలేక, ప్రత్యామ్నాయమార్గాలను కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. తెలంగాణ టీఎస్ఐపాస్‌కు ఆకర్షితులై ప్లాంట్‌ను ఇక్కడ నెలకొల్పేందుకు నిర్ణయించారు. 35 ఏండ్లపాటు మైసూరులో సేవలందిస్తున్నామని, స్థానికంగా ఉన్న వందలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామని కాంగ్రెస్ సర్కారుకు ప్రతిపాదన లేఖలో విన్నవించామని, అయినప్పటికీ, సర్కారు అనుమతులనివ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని కేన్స్ కంపెనీకి చెందిన ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు.



సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు గత మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్‌లో భూమిపూజచేస్తున్న కర్ణాటకకు చెందిన కేన్స్ టెక్నాలజీస్ ప్రతినిధులు

### ఇలాగైతే ఉద్యోగాలు వచ్చినట్టే!

కేన్స్ సెమీకండక్టర్ ప్లాంట్ కర్ణాటక దాటి వెళ్లడంపై ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో, కర్ణాటకకు చెందిన మోహన్‌దాస్ పాయ్ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ సర్కారు వైఖరిని ఎండగట్టారు. ప్లాంట్ తరలిపోయిన రోజును కర్ణాటక ప్రజలకు దుర్దినంగా అభివర్ణించారు. కాంగ్రెస్ సర్కారు బద్ధకం, అసమర్థత, తీవ్ర జాప్యం, జవాబుదారీతనం లేకపోవటం వల్లే మైసూరు నుంచి ఓ మంచి కంపెనీ తెలంగాణకు తరలి వెళ్లిపోయిందని ధ్వజమెత్తారు. కంపెనీలు ఇలాగే తరలిపోతే కన్నడ యువతకు ఉద్యోగాలు ఎలా వస్తాయని సిద్ధరామయ్య సర్కారును నిలదీశారు. పాయ్ వ్యాఖ్యలను పలువురు నెటిజన్లు సమర్థించారు. దీంతో అప్రమత్తమైన కర్ణాటక పరిశ్రమల శాఖమంత్రి ఎంబీ పాటిల్ కొత్త కథ మొదలుపెట్టారు. రూ. 500 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలను సీఎం నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ ఆమోదించాల్సి ఉంటుందని, అయినప్పటికీ, ఆ భేటీకి ముందే కేన్స్ కంపెనీ ప్రతిపాదనలను తాము ఆమోదించినట్టు పేర్కొన్నారు. అయితే, కంపెనీ ప్రతినిధులు ఎక్కువ రాయితీలను కోరారన్న మంత్రి.. రాయితీల పేరిట తాము నిబంధనలను ఉల్లంఘించలేమని చెప్పుకొచ్చారు. అయితే, మంత్రి వ్యాఖ్యలు అబద్ధాలని కేన్స్ కంపెనీ వర్గాలు చెప్తున్నాయి. కాంగ్రెస్ సర్కారు అసమర్థ విధానాలు, జాప్యంతోనే కేన్స్ ప్లాంట్ తరలిపోయిందని కన్నడ పౌరులు మండిపడుతున్నారు.

### టీఎస్ఐపాస్ భేష్

పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్నిరకాల సదుపాయాలను టీఎస్ఐపాస్ ద్వారా త్వరితగతిన తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్నది. దీంతో పెట్టుబడిదారులు భారీగా ముందుకొస్తున్నారు. దీనికి తాజా ఉదాహరణ కేన్స్ టెక్నాలజీస్ సెమీకండక్టర్ ప్లాంటే. ఈ నెల తొలివారంలో కేన్స్ ప్రతినిధులు ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌తో ప్రత్యేక భేటీ కావటం, నెల చివరినాటికి ప్లాంట్ ఏర్పాటుకు భూమి పూజ కూడా జరగటమే దీనికి నిదర్శనం. టీఎస్ఐపాస్‌తో 15 రోజుల్లోనే అనుమతులు లభిస్తుండటంతో గత తొమ్మిదేండ్లలో రాష్ట్రానికి 23 వేల పరిశ్రమలు క్యూ కట్టాయి. 17 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. అందుకే, స్నేహపూర్వక పారిశ్రామిక విధానానికి కేరాఫ్‌గా మారిన టీఎస్ఐపాస్‌పై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తున్నది.

### కేన్స్ టెక్నాలజీస్ సమగ్ర స్వరూపం

- ప్రారంభం: 1988
- ప్రధాన కేంద్రం: మైసూరు
- కీలక వ్యక్తులు: సవితా రమేశ్ (చైర్‌పర్సన్), రమేశ్ కన్నన్(ఎండీ) రాజేశ్ శర్మ (సీఈవో)
- ఉద్యోగులు: 1,500
- ఆదాయం: రూ.676 కోట్లు (2022-23లో)
- గ్లోబల్ సర్టిఫికేషన్లు-10
- సేవల పరిధి-3 ఖండాలు
- క్లయింట్స్-250

కంపెనీ ఉత్పత్తి చేస్తున్న పరికరాలు..

- మెడికల్: స్మార్ట్ గ్లూకోమీటర్, వ్యాప్‌కేర్, కంట్రోలర్
- రైల్వేస్: ఆడియో ఫ్రిక్వెన్సీ ట్రాక్ సర్క్యూట్, ఈటీసీఎస్-ఆన్ బోర్డ్ క్యూబికల్
- ఐవోటీ/ఐటీ: బార్ కోడ్ స్కానర్, పీఎల్‌సీ గేట్‌వే, ఆర్ఎఫ్ఐడీ గేట్‌వే, గేట్‌వే అసెట్ కండిషన్ మానిటరింగ్, ఇండస్ట్రియల్ ట్యాబ్లెట్, హెచ్ఎంఐ, ఆర్‌టీడీ టెంపరేచర్
- ఇండస్ట్రియల్: ఇంజిన్ కంట్రోల్, స్ట్రీట్ లైట్ కంట్రోలర్, యాక్సలరీమీటర్, ఇండస్ట్రియల్ యూపీఎస్,
- ఏరోస్పేస్ డిఫెన్స్: ఎలక్ట్రానిక్ సేఫ్ అండ్ ఫైర్ పరికరం, ఏటీఈ అండ్ ఎల్ఆర్‌యూ అసెంబ్లింగ్, హ్యాండ్ హెల్డ్ సోనార్

### రెండువేల మందికి ఉద్యోగాలు



తెలంగాణలో సెమికండక్టర్ ఓఎస్ఏటీ, కాంపౌండ్ సెమికండక్టర్ టెక్నాలజీతో కంపెనీని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన కేన్స్ టెక్నాలజీ సంస్థకు అభినందనలు. 2,800 కోట్ల పెట్టుబడితో నెలకొల్పనున్న యూనిట్ ద్వారా రెండువేల మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కేన్స్ రాక తెలంగాణకు వ్యూహాత్మక పెట్టుబడి అవుతుంది. తెలంగాణలో సెమికండక్టర్ అనుకూల వ్యవస్థను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నది.

– కేన్స్ టెక్నాలజీ ప్రతినిధుల భేటీ సమయంలో మంత్రి కేటీఆర్

### ఎలక్ట్రానిక్స్ హబ్‌గా కొంగరకలాన్

కేన్స్ ప్లాంట్‌లో తయారయ్యే సెమీ కండక్టర్స్‌ను దేశ, విదేశీ మార్కెట్లలోకి తీసుకెళ్తాం. తైవాన్, జపాన్ తదితర దేశాలకు ఎగుమతి అవుతాయి. రకరకాల ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కోసం మదర్ బోర్డులనూ తయారు చేస్తాం. భవిష్యత్తులో కొంగరకలాన్ పేరు ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మార్మోగుతుంది. టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందిన తైవాన్, జపాన్ వంటి దేశాల సరసన భారత్ నిలవడానికి కొంగరకలాన్ తరహా ఇండస్ట్రియల్ పార్కులు అవసరం.

– సవితా రమేశ్, కేన్స్ టెక్నాలజీ చైర్‌పర్సన్ (భూమిపూజ వేడుకలో)



మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని రామన్నపల్లిలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

## కాంగ్రెస్‌కు ఓటేస్తే.. పథకాలు ఆగుతాయి

**ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

మహబూబ్‌నగర్ టౌన్/హన్వాడ, అక్టోబర్ 28: 60 ఏండ్లు అధికారంలో ఉండి ప్రజలను దోచుకొని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి మళ్లీ ఓటేస్తే.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులన్నీ ఆగిపోతాయని, తద్వారా యావత్ తెలంగాణ ఆగమైతదని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో, హన్వాడ మండలంలో శనివారం మంత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు అడుగడుగునా మంత్రికి బ్రహ్మరథం పట్టారు. బతుకమ్మలు, గంగిరెద్దుల నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సర్కారు పక్కా హ్యాట్రిక్ కొడుతుందని ధీమా వ్యక్తం చేశారు. పేదలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని, తనను మరోసారి ఆశీర్వదిస్తే మహబూబ్‌నగర్‌ను మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. రూ.ఐదు లక్షల ఆరోగ్యశ్రీని రూ.15 లక్షలకు పెంచుతామని, రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తామని వివరించారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని, వారికి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ కూతురు శ్రీహిత, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు రేవంత్ క్షమాపణ చెప్పాలి

- కాంగ్రెస్‌ను నమ్మితే గోస పడుతాం
- మీడియాతో మంత్రి సత్యవతి



మహబూబాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): గిరిజనులను అవమానపరిచిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెంటనే గిరిజన జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. శనివారం మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డితో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. వెయ్యి రూపాయలు ఇచ్చి గుడుంబా పోస్తే గిరిజనులు ఓట్లు వేస్తారని రేవంత్‌రెడ్డి అహంకార పూరితంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. రేవంత్‌రెడ్డి వెంటనే గిరిజనులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచితే, కాంగ్రెస్ నాయకులు కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అంటే నయవంచన, బీఆర్ఎస్ అంటే ఒక నమ్మకమని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెసోళ్లను నమ్మితే మోసపోతారని హెచ్చరించారు. మళ్లీ అధికారంలోకి వస్తే రూ.400లకే గ్యాస్ సిలిండర్, సౌభాగ్యలక్ష్మి ద్వారా మహిళలకు రూ.3 వేలు, రేషన్ కార్డు ఉన్న వారికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం ఇస్తామని ఆమె తెలిపారు. కాంగ్రెస్‌ను 11 సార్లు గెలిపిస్తే వ్యవసాయ రంగాన్ని దండగ చేశారని, బీఆర్ఎస్ 11 సార్లు రైతుబంధు ఇచ్చి వ్యవసాయాన్ని పండుగ చేసిందని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించి హ్యాట్రిక్ గెలుపు ఇవ్వాలని ఆమె కోరారు.


